# 598 కిలోల గంజాయి పట్టివేత

**- తాటియాకులగూడెం చెక్‌పోస్ట్ వద్ద వాహన తనిఖీల్లో భారీగా గంజాయి స్వాధీనం**
**- ఇద్దరు నిందితుల అరెస్ట్, టాటా డీసీఎం వ్యాన్ స్వాధీనం**
**- మొత్తం రూ.3.14 కోట్ల విలువైన గంజాయి, వాహనం, సెల్‌ఫోన్లు పట్టివేత**

గాయత్రి వార్తలు ఏలూరు జిల్లా ఇంచార్జ్ బి ప్రభాకర్

ఏలూరు జిల్లాలో మాదకద్రవ్యాల అక్రమ రవాణాపై చేపట్టిన 'ఆపరేషన్ వజ్రప్రహార్'లో భాగంగా జీలుగుమిల్లి పోలీసులు భారీగా గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. జిల్లా ఎస్పీ కె. ప్రతాప్ శివ కిషోర్ ఆదేశాల మేరకు నిర్వహించిన ప్రత్యేక తనిఖీలలో సుమారు 598 కిలోల గంజాయి పట్టుబడింది. ఈ ఘటనలో ఇద్దరు వ్యక్తులను పోలీసులు అరెస్ట్ చేసి, వారి వద్ద ఉన్న టాటా డీసీఎం వ్యాన్‌తో పాటు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న గంజాయి, వాహనం మరియు ఇతర వస్తువుల విలువ సుమారు రూ.3.14 కోట్లుగా అధికారులు అంచనా వేశారు. జంగారెడ్డిగూడెం అశ్వారావుపేట జాతీయ రహదారి ( ఎన్ హెచ్-516డి)పై తాటియాకులగూడెం వద్ద ఉన్న ఆంధ్ర-తెలంగాణ సరిహద్దు చెక్‌పోస్ట్ వద్ద గురువారం సాయంత్రం జీలుగుమిల్లి ఎస్ఐ వి. క్రాంతికుమార్ సిబ్బందితో కలిసి వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సమయంలో జంగారెడ్డిగూడెం వైపు నుండి అశ్వారావుపేట వైపు వెళ్తున్న టాటా డీసీఎం వ్యాన్‌ను అనుమానం రావడంతో ఆపి తనిఖీ చేశారు. తనిఖీల్లో వ్యాన్‌లో భారీగా గంజాయి తరలిస్తున్నట్లు గుర్తించారు. అనంతరం రెవెన్యూ అధికారుల సమక్షంలో పంచనామా నిర్వహించి నిందితులను




అదుపులోకి తీసుకున్నారు.
అరెస్ట్ చేసిన నిందితులు దిలీప్ కుమార్ మొహంతి, గంజాం జిల్లా బిజాపూర్ గ్రామం, జనార్ధన్ ప్రాదాన్ ఒడిశా రాష్ట్రంలోని బ్రహ్మపుర్ ప్రాంతానికి చెందినవారని పోలీసులు తెలిపారు. దర్యాప్తులో తేలిన వివరాల ప్రకారం రాజమండ్రి సమీపంలోని బూరుగుపూడి ప్రాంతం నుంచి గంజాయిని లోడ్ చేసి మహారాష్ట్రలోని బీడ్ ప్రాంతానికి అక్రమంగా తరలిస్తున్నట్లు నిందితులు ఒప్పుకున్నట్లు వెల్లడించారు. ఈ ఘటనపై జీలుగుమిల్లి పోలీస్ స్టేషన్‌లో పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ఈ కేసు దర్యాప్తును జీలుగుమిల్లి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బి. వెంకటేశ్వరరావు చేపట్టి నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్ నిమిత్తం కోర్టుకు తరలించారు. ఈ ఆపరేషన్‌లో ఎస్ఐ క్రాంతికుమార్‌తో పాటు హెడ్ కానిస్టేబుల్ నాగేశ్వరరావు, కానిస్టేబుళ్లు శ్రీరామ్ మణికంట, లక్ష్మణరావు, రవికుమార్, మహేష్ బాబు, శ్రీనివాసరెడ్డి, సురేష్ పాల్గొన్నారు. అంతర్రాష్ట్ర గంజాయి రవాణా ముఠాను పట్టుకొని కోట్ల రూపాయల విలువైన గంజాయిని స్వాధీనం చేసుకున్న పోలీసు బృందాన్ని జిల్లా ఎస్పీ అభినందించారు. మాదకద్రవ్యాల అక్రమ రవాణాపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.

# 22ఏ భూ సమస్యల పరిష్కారం పై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలి

**- మార్చి నెలలో పట్టాదార్ పాస్ పుస్తకాల పంపిణీ పూర్తి చేయాలి**
**- కోర్ట్ కేసులు త్వరితగతిన పరిష్కరించాలి.**
**- రెవిన్యూ కార్యక్రమాలపై అధికారులతో జిల్లా కలెక్టర్ కె.వెట్రి సెల్వి సమీక్ష**



గాయత్రి వార్తలు ఏలూరు జిల్లా ఇంచార్జ్ బి ప్రభాకర్

జిల్లాలో 22ఏ భూ సమస్యలకు సంబంధించి అందిన విజ్ఞప్తులను నిర్ణీత సమయంలోగా పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి రెవిన్యూ అధికారులను ఆదేశించారు. గౌతమీ సమావేశమందిరంలో శుక్రవారం 22ఏ భూ సమస్యల పరిష్కారం, రీ సర్వే, ఆడంగల్ లో భూమి రికార్డునమోదు, కోర్ట్ కేసులు పరిష్కారం ,ఆర్ ఓ ఆర్, తదితర అంశాలపై జాయింట్ కలెక్టర్ డా. ఎం.జె. అభిషేక్ గౌడ తో కలిసి జిల్లా కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో నిషేదిత భూముల జాబితాలో జిరాయితీ భూములు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో 22ఏ భూ సమస్యలకు సంబంధించి 229 విజ్ఞప్తులు అందగా వాటిలో 18 పరిష్కరించడం జరిగిందని, 10 కేసులు రిజెక్ట్ చేయడం జరిగిందన్నారు. మిగిలిన విజ్ఞపులను నిర్దేశించిన సమయంలోగా పరిష్కరించాలన్నారు. మార్చి నెలలో 2249 పట్టాదార్ పాస్ పుస్తకాలు పంపిణీ చేయవలసి ఉండగా, 2184 పాస్ పుస్తకాలు పంపిణీ చేశామని, మిగిలినవి రెండు రోజుల్లోగా పంపిణీ చేయవలసిందిగా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. జిల్లాలో భూమి యాజమాన్యం, సాగు విస్తీర్ణం, హద్దులు, పట్టాదారు పాస్ పుస్తకాలు, ఆర్. ఓ .ఆర్ .కు సంబంధించి ఏ ఒక్క అంశం పెండింగ్. లేకుండా త్వరిత గతిన పూర్తి చేయాలని లని జిల్లాకలెక్టర్ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. రెవిన్యూ శాఖలో కోర్ట్ కేసులకు సంబంధించి వాటికి వెంటనే కౌంటర్ వేయించాలన్నారు. పీజీ ఆర్ఎస్ లో పెండింగ్ లో ఉన్న ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా జాయింట్ కలెక్టర్ డా. ఎం.జె. అభిషేక్ గౌడ, డిఆర్ఓ వి. విశ్వేశ్వరరావు, నూజివీడు సబ్ కలెక్టర్ బొల్లిపల్లి వినూత్న, ఏలూరు, జంగారెడ్డిగూడెం ఆర్డీఓ లు, సర్వే శాఖాధికారి అన్సారీ, వివిధ మండలాల తహసీల్దార్లు పాల్గొన్నారు

# ఇంటర్ పరీక్షలలో సిసి కెమెరాలతో నిఘా పెట్టాలి

**- ఎక్కడైనా మాస్ కాపీయింగ్ జరిగితే సంబంధిత ఇన్విజిలేటర్, కేంద్రం పర్యవేక్షకులపై చర్యలు**
**- ఏలూరులోని పిడిబిటి కళాశాలలో ఇంటర్ పరీక్షల నిర్వహణను ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి**

గాయత్రి వార్తలు ఏలూరు జిల్లా ఇంచార్జ్ బి ప్రభాకర్

ఇంటర్ పరీక్షలలో మాస్ కాపీయింగ్ జరగకుండా సిసి కెమెరాల ద్వారా పర్యవేక్షించాలని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. స్థానిక అశోక్ నగర్ లోని పిడిబిటి కళాశాలలో శుక్రవారం ఇంటర్ పరీక్షల నిర్వహణను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రతీ రూమ్ ను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ ఏలూరు జిల్లాలో ఇంటర్ పరీక్షలను 130 కేంద్రాలలో ఈనెల 24వ తేదీ వరకు నిర్వహించడం జరుగుతుందన్నారు. 34,615 మంది విద్యార్థినీ, విద్యార్థులు హాజరుకానున్నట్లు చెప్పారు. ప్రతీ పరీక్షా కేంద్రాల హాల్స్ లో సిసి కెమెరాలతో నిఘా ఏర్పాటుచేయడం జరిగిందని, ఎక్కడైనా మాస్ కాపీయింగ్ జరిగితే సంబంధిత ఇన్విజిలేటర్ పై చర్యలు తీసుకుంటామని, ఎక్కడా మాస్ కాపీయింగ్ జరగకుండా ఇన్విజిలేటర్లు పర్యవేక్షించాలన్నారు. పరీక్షా కేంద్రాలలో సెల్ ఫోన్ లను ఎట్టిపరిస్థితులలోనూ అనుమతించవద్దన్నారు. పరీక్షా కేంద్రాల



వద్ద జిరాక్స్, ఇంటర్ నెట్ సెంటర్ల ను ఉదయం 8.30 గంటల నుంచి పరీక్ష ముగిసేవరకు ఆయా షాపులను మూసివుంచాలన్నారు. పరీక్షా కేంద్రాలలో త్రాగునీరు, పారిశుద్యం ఏర్పాట్లను ప్రతిరోజు పర్యవేక్షించాలని కలెక్టర్ ఆదేశించారు. పరీక్షల నిర్వహణకు సంబంధించి జిల్లా కేంద్రంలో కంట్రోల్ రూమ్ 08812-230197 ఫోన్ నెంబరుతో ఏర్పాటు చేయడం జరిగిందని, ఏదైనా సమస్య ఉంటె కంట్రోల్ ఫోన్ చేయవచ్చని కలెక్టర్ చెప్పారు. అనంతరం కళాశాలలోని సిసి కెమెరాల పర్యవేక్షణ విభాగాన్ని కలెక్టర్ పరిశీలించారు. కలెక్టర్ వెంట ఆర్ఐఓ పి. యోహాను, ఏలూరు తహసీల్దార్ గాయత్రి పాల్గొన్నారు.

# దుకాణాలు తిరిగి జనసేన సభ్యత్వ నమోదు చేపట్టిన కొట్టే సాయి ప్రసాద్

శ్రీకాళహస్తి, మార్చి 06,గాయత్రి వార్తలు :రిపోర్టర్ : రంజిత్



జనసేన పార్టీ బలోపేతానికి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని వేగవంతం చేస్తూ శ్రీకాళహస్తి పట్టణంలో శుక్రవారం విస్తృతంగా నిర్వహించారు. పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ కూడలి వద్ద శ్రీకాళహస్తీశ్వర స్వామి దేవస్థానం చైర్మన్, ఉమ్మడి చిత్తూరు జిల్లా జనసేన పార్టీ కార్యదర్శి కొట్టే సాయి ప్రసాద్ ఆధ్వర్యంలో ఉద్యమి జనసేన సభ్యత్వ నమోదు కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా కొట్టే సాయి ప్రసాద్ పట్టణంలోని పరిసర ప్రాంతాల్లోని దుకాణాలను స్వయంగా సందర్శించి వ్యాపారులు, స్థానిక ప్రజలను కలుసుకున్నారు. జనసేన పార్టీ సిద్ధాంతాలు, పార్టీ లక్ష్యాలు, క్రియాశీలక సభ్యత్వం ద్వారా ప్రజలకు కలిగే ప్రయోజనాలను వివరించారు. ఆయన పిలుపుతో పలువురు యువకులు, వ్యాపారులు ముందుకు వచ్చి జనసేన సభ్యత్వాన్ని నమోదు చేసుకున్నారు. జనసేన పార్టీని బలపరిచే దిశగా ఇలాంటి కార్యక్రమాలుకొనసాగుతాయని కొట్టే సాయి ప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో జనసేన నాయకులు కుమార్, జయప్రకాష్, మహేష్, గరికపాటి చంద్ర, జానీ భాషా, చిరంజీవి తదితరులు మరియు జనసైనికులు పాల్గొన్నారు.

# నాగమణికి వైసీపీ నాయకుల పరామర్శ

**- ఆర్థిక సాయం అందజేసిన పార్టీ మండల అధ్యక్షులు తాంద్ర రాజేష్**

గాయత్రి వార్తలు ఏలూరు జిల్లా ఇంచార్జ్ బి ప్రభాకర్



ఏలూరు జిల్లా కుక్కునూరు మండలం,దాచారం పంచాయితీలోని బెస్తగూడెం గ్రామానికి చెందిన వైఎస్సార్సీపీ కార్యకర్త వనపర్తి నాగమణిని ఎద్దులు పొడవడంతో గాయపడి ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయం తెలుసుకున్న వైసీపీ మండల పార్టీ అధ్యక్షులు తాంద్ర రాజేష్, పార్టీ నాయకులతో కలసి శుక్రవారం ఆమె నివాసానికి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా నాగమణి ఆరోగ్య పరిస్థితి గురించి తెలుసుకుని,ఆర్థిక సాయం అందజేశారు. అలాగే పార్టీ ఎల్లవేళలా కార్యకర్తలకు అండగా ఉంటుందని, ఎలాంటి ఇబ్బందులు వచ్చినా వైఎస్సార్సీపీ కుటుంబం తోడుగా నిలుస్తుందని భరోసా నిచ్చారు. ఆమె త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ, అవసరమైన సహాయం అందించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో దాచారం నాయకులు అమరవరపు శ్రీనివాసరావు, మండల నాయకులు రావు వినోద్, నియోజకవర్గ సోషల్ మీడియా ఇన్చార్జ్ మల్లేలా చంటి నాయుడు, మండల ఉపాధ్యక్షులు రాయి సత్యనారాయణ, పెద్దిపల్లి రామయ్య తదితరులు ఉన్నారు.

# పిల్లలు సోషల్ మీడియా వాడకుండా చర్యలు: సీఎం చంద్రబాబు

గాయత్రి వార్తలు ఏలూరు జిల్లా ఇంచార్జ్ బి ప్రభాకర్



పిల్లలకు సోషల్ మీడియా నిషేధంపై సీఎం చంద్రబాబు అసెంబ్లీలో కీలక వ్యాఖ్యలు చేశారు. 13 ఏళ్ల వయసులోపు ఉన్న వారికి రాబోయే 90 రోజుల్లో సోషల్ మీడియా అందుబాటులో లేకుండా చేసే కార్యక్రమానికి శ్రీకారం చుడతామన్నారు. 13 నుంచి 16 ఏళ్ల మధ్య వయసు వారికి సంబంధించి ఏం చేయాలనేదానిపై చర్చిస్తున్నట్లు తెలిపారు. సోషల్ మీడియాతో మన పిల్లలు నష్ట పోవడానికి వీలు లేదన్నారు. అందుకోసం ఈ ప్రభుత్వం కట్టుబడి ఉంటుందన్నారు. టెక్నాలజీని వాడుకుంటే ఆయుధంగా పనిచేస్తుందని, బానిసైతే జీవితాలు నాశనమవుతాయని సీఎం హితవు పలికారు.

# సైబర్ మోసాల నిందితుడి అరెస్ట్

గాయత్రి వార్తలు ఏలూరు జిల్లా ఇంచార్జ్ బి ప్రభాకర్



సైబర్ మోసాలకు పాల్పడుతున్న నిందితుడు భీముడు. అజిత్ కుమార్ ను పోలీసులు అరెస్ట్ చేశారు. ఆ నిందితుడు ఆాశ ప్లాట్‌ఫారమ్‌ను ఉపయోగించి కార్ల కొనుగోలు, అమ్మకాల పేరుతో పలువురు వ్యక్తులను మోసం చేసినట్లు విచారణలో వెల్లడైంది. భీముడు అజిత్ కుమార్,ఏలూరు జిల్లా,పెదవేగి మండలం, నాగన్న గూడెం గ్రామానికి చెందిన వాడుగా పోలీసులు తేల్చారు.

### మోసం చేసే విధానం :

నిందితుడు ఆాశ ప్లాట్‌ఫారమ్‌లో కార్ డీలర్‌గా నటిస్తూ కార్లు అమ్మకానికి పెట్టిన వ్యక్తులను సంప్రదించేవాడు. అదే సమయంలో కార్ యజమానిగా నటిస్తూ తెలిసిన కార్ డీలర్లతో కూడా సంప్రదింపులు జరిపేవాడు. ఈ విధంగా ఇద్దరి మధ్య కార్ కొనుగోలు ఒప్పందం కుదిరిన తర్వాత, కార్ డీలర్లను తప్పుదారి పట్టించి డబ్బును తనకు సంబంధించిన మ్యూల్ బ్యాంక్ ఖాతాల్లోకి జమ చేయించేవాడు. నిందితుడు ఉపయోగించిన బ్యాంక్ ఖాతాలు సాధారణంగా బంగారు దుకాణాల యజమానుల పేర్లలో ఉండేవి. ఆ ఖాతాల్లో డబ్బు జమ అయిన వెంటనే అదే మొత్తానికి సమానంగా బంగారం కొనుగోలు చేసి, ఆ బంగారాన్ని బెంగళూరు, తమిళనాడు వంటి ఇతర రాష్ట్రాల్లో నగదుగా మార్చుకునేవాడు.

### నమోదైన కేసులు:

- ఆంధ్రప్రదేశ్ 8 కేసులు
- తెలంగాణ 2 కేసులు
- తమిళనాడు 2 కేసులు

పై 12 కేసుల ద్వారా బాధితుల నుంచి మొత్తం రూ.94 లక్షలు మోసం చేసినట్లు గుర్తించారు. పోలీసులు నిందితుడి వద్ద నుంచి సుమారు రూ.50 లక్షల విలువైన బంగారం, నగదును స్వాధీనం చేసుకున్నారు.

### నాన్-బెయిలబుల్ వారెంట్లు:

నిందితుడిపై తెలంగాణలో 2, తమిళనాడులో 1 నాన్-బెయిలబుల్ వారెంట్లు పెండింగ్‌లో ఉన్నాయని,ప్రజలు ఆన్‌లైన్ ప్లాట్‌ఫారమ్‌లలో కొనుగోలు, అమ్మకాలు చేసే సమయంలో అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద వ్యక్తులతో డబ్బు లావాదేవీలు చేయకూడదని పోలీసులు సూచించారు.
అతనిపై నమోదైన సుమారు 20 చీటింగ్ కేసులు కేసు విచారణ లో ఉన్నాయని తెలిపారు.

# రిషితా రెడ్డి చేతుల మీదుగా కాట్రకాయుల గుంటలో అంగన్వాడీ భవనం ప్రారంభం

శ్రీకాళహస్తి, మార్చి 06,గాయత్రి వార్తలు :రిపోర్టర్ : రంజిత్

శ్రీకాళహస్తి నియోజకవర్గం,ఏర్పేడు మండలం కాట్రకాయలగుంట గ్రామంలో కోకా కోలా సంస్థ సి.ఎస్.ఆర్ నిధుల సహకారంతో నిర్మించిన నూతన అంగన్వాడీ భవనాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి సతీమణి బొజ్జల రిషితా రెడ్డి భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో చిన్నారులకు మెరుగైన విద్యా సదుపాయాలు కల్పించడం ఎంతో అవసరమని తెలిపారు. అంగన్వాడీ కేంద్రాలు చిన్నారుల శారీరక, మానసిక అభివృద్ధికి



పునాది వంటివని పేర్కొన్నారు. కోకా కోలా సంస్థ సి.ఎస్.ఆర్ కార్యక్రమాల ద్వారా గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి తోడ్పడటం అభినందనీయమని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో ఏర్పేడు టీడీపీ మండల అధ్యక్షుడు పేరం నాగరాజ నాయుడు, నైనూరు పున్నారావు, ఏర్పేడు పాక్స్ చైర్మన్ మహేష్ రెడ్డి, సి.ఎస్.ఆర్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ షైక్ ఖలీల్ బాషా, పి.ఎ.సి ఆఫీసర్ నిటేష్ (హెచ్సీసీబీ), సీడీపీఓ కృష్ణవేణి, సూపర్వైజర్ రత్నమ్మ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా గాలి కృష్ణవేణి, రాఘవేంద్ర, సురేష్, చంద్రశేఖర్ నాయుడు, రాజా, గుణ యాదవ్, కె.కె. రమణ, రాచటి సుబ్రహ్మణ్యం, మునిరెడ్డి, కేశినేని సుబ్రహ్మణ్యం, నారాయణ, రామదాసు, బి. కృష్ణయ్య, చంద్ర, శ్రీపతి, వెంకటరమణ, బాలకృష్ణారెడ్డి, సుబ్రహ్మణ్యం రెడ్డి, నాగంపల్లి సుబ్రహ్మణ్యం రెడ్డి, హరి, వై. మనోహర్ నాయుడు తదితర నాయకులు, అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు. గ్రామస్థులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి: జేసీ శ్రీనివాసులు

గాయత్రి వార్తలు

ఈనెల 8వ తేదీన జరగనున్న అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని జిల్లాలో అత్యంత ఘనంగా నిర్వహించాలని జాయింట్ కలెక్టర్ పి. శ్రీనివాసులు అధికారులను ఆదేశించారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లో వివిధ శాఖల అధికారులతో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. సమాజ అభివృద్ధిలో మహిళల పాత్ర కీలకమని కొనియాడిన ఆయన, వారిని గౌరవించుకునేలా ఈ వేడుకలు ఉండాలని ఆకాంక్షించారు.





?ఈ సందర్భంగా నిర్వహించాల్సిన కార్యక్రమాలపై అధికారులకు జేసీ దిశానిర్దేశం చేశారు. వేడుకలకు సంబంధించి అన్ని ఏర్పాట్లను ముందస్తుగా పూర్తి చేయాలని, ఎక్కడా ఎటువంటి లోటుపాట్లు లేకుండా జాగ్రత్త వహించాలని సూచించారు. వివిధ రంగాల్లో ప్రతిభ కనబరిచిన మహిళలను గుర్తించి, వారిని ఈ వేడుకల్లో సత్కరించడం ద్వారా ఇతరులకు స్ఫూర్తిని నింపాలని అధికారులకు వివరించారు. ఈ కార్యక్రమంలో పలు శాఖలకు చెందిన ఉన్నతాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# విద్యార్థుల ఉత్తీర్ణత, సంక్షేమమే లక్ష్యంగా పనిచేయాలి: డి.డి. లక్ష్మా నాయక్





గాయత్రి వార్తలు

ప్రభుత్వ వసతి గృహాల్లో చదువుకుంటున్న విద్యార్థుల విద్యా ప్రగతి మరియు వారి సంక్షేమంపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ (డి.డి.) శ్రీ ఎన్. లక్ష్మా నాయక్ ఆదేశించారు. శుక్రవారం మార్కాపురం స్థానిక ఎం.పి.డి.ఓ కార్యాలయంలో జిల్లాలోని లు, మరియు లతో ఆయన సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలోని హాస్టళ్ల పనితీరు, విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలపై ఆయన సుదీర్ఘంగా చర్చించారు.

?వసతి గృహాల్లోని విద్యార్థుల అకడమిక్ గ్రేడింగ్‌పై సమీక్షిస్తూ, ముఖ్యంగా 10వ తరగతి మరియు ఇంటర్మీడియట్ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేలా వార్డెన్లు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని లక్ష్మా నాయక్ స్పష్టం చేశారు. ప్రతి విద్యార్థి విద్యాపరంగా రాణించేలా నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. అదేవిధంగా, హాస్టళ్లలో విద్యార్థులకు అందుతున్న భోజన, వసతి సౌకర్యాలపై తల్లిదండ్రుల నుండి ఎప్పటికప్పుడు ఫీడ్‌బ్యాక్ సేకరించాలని, మెనూ ప్రకారం నాణ్యమైన ఆహారాన్ని అందించాలని ఆదేశించారు.

విద్యార్థుల ఆరోగ్య విషయంలో ఎటువంటి అలసత్వం వహించకూడదని, నెలవారీ వైద్య నివేదికలను నిశితంగా పరిశీలించాలని అధికారులను హెచ్చరించారు. వసతి గృహాల ఆవరణలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు, భవనాలకు అవసరమైన మరమ్మతులు మరియు ఇతర మౌలిక సదుపాయాల కల్పనపై సమగ్ర నివేదికలను సిద్ధం చేయాలన్నారు. హాస్టళ్లకు కేటాయించిన బడ్జెట్ వినియోగంలో పూర్తి పారదర్శకత ఉండాలని, ప్రభుత్వ నిధుల దుర్వినియోగానికి తావులేకుండా చూడాలని పేర్కొన్నారు. విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు కోసం అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని, విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఈ సందర్భంగా డి.డి. లక్ష్మా నాయక్ హెచ్చరించారు.

# ఇంటి పన్ను చెల్లింపులపై అవగాహన కల్పించాలి

**- ఎంపీడీవో ఎల్ బ్రహ్మయ్య**



గాయత్రి వార్తలు

మండల కేంద్రంలోని సి.ఎస్.పురం వెలుగు కార్యాలయంలో వీఓఏలకు, పంచాయతీ కార్యదర్ పంచాయతీ కార్యదర్శులు, వెలుగు సిబ్బందికి ఇంటి పన్ను చెల్లింపులపై శుక్రవారం ఎంపీడీవో ఎల్ బ్రహ్మయ్య అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో ఎల్ బ్రహ్మయ్య మాట్లాడుతూ గ్రామాల్లో ప్రతి కుటుంబం తప్పనిసరిగా ఇంటి పన్ను చెల్లించేలా మహిళా సమాఖ్య సభ్యులకు తెలియజేసి చైతన్యవంతం చేయాలని సూచించారు. గ్రామాభివృద్ధికి పన్నుల వసూళ్లు కీలకమని తెలిపారు. మహిళా సంఘాల ద్వారా ప్రజల్లో అవగాహన పెంచితే ఇంటి పన్ను వసూళ్లు మరింత మెరుగవుతాయని, గ్రామాల్లో సచివాలయ సిబ్బందితో సమన్వయం చేసుకొని ఇంటి పన్ను వసూళ్లలో సహకరించాలని వీఓఏలకు సూచించారు. ప్రతి ఇంటికి వెళ్లి పన్ను చెల్లింపుల అవసరాన్ని వివరించి ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని, గ్రామాభివృద్ధి కార్యక్రమాలకు అందరూ భాగస్వాములు కావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిసి లు, ఐ మస్తాన్ రెడ్డి, టి కాశయ్య, యం వి నారాయణమ్మ, పంచాయతీ కార్యదర్శులు , వీఓఏలు తదితరులు పాల్గొన్నారు.

# సీడ్ క్యాపిటల్ ఆహార ఉత్పత్తుల లబ్ధిదారులకు అవగాహన కార్యక్రమం






**- జిల్లా రిసోర్స్ పర్సన్ పి ఆదిలక్ష్మి**

గాయత్రి వార్తలు

మండల కేంద్రంలోని సి.ఎస్.పురం వెలుగు కార్యాలయంలో సీడ్ క్యాపిటల్ ఆహార ఉత్పత్తుల లబ్ధిదారులకు శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా రిసోర్స్ పర్సన్ పి. ఆదిలక్ష్మి హాజరై లబ్ధిదారులకు పథకం గురించి వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీడ్ క్యాపిటల్ పథకం ద్వారా ఆహార ఉత్పత్తుల తయారీకి లబ్ధిదారులు రూ.40 వేల వరకు రుణాలు పొందవచ్చని తెలిపారు. ఈ సహాయం పొందాలంటే తప్పనిసరిగా ఉద్యమ సర్టిఫికెట్ ఉండాలని పేర్కొన్నారు. ఉద్యమ సర్టిఫికెట్ పొందేందుకు ఆధార్ కార్డు, పాన్ కార్డు మరియు ఆధార్ కు లింక్ అయిన మొబైల్ ఫోన్ నంబర్ అవసరమని వివరించారు. అలాగే ఆహార ఉత్పత్తుల తయారీ, మార్కెటింగ్ విధానాలు, నాణ్యత ప్రమాణాలు వంటి అంశాలపై లబ్ధిదారులకు అవగాహన కల్పించారు. మహిళా సంఘాల సభ్యులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని స్వయం ఉపాధి అవకాశాలను పెంపొందించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిసి లు ఐ మస్తాన్ రెడ్డి, టి కాశయ్య, యం వి నారాయణమ్మ, విఓఏలు, సీడ్ క్యాపిటల్ పథకం లబ్ధిదారులు పాల్గొన్నారు.

# బొత్స ను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే కదిరి



గాయత్రి వార్తలు

శాసన మండలి ప్రతిపక్ష నేత ,మాజీ మంత్రివర్యులు బొత్స సత్యనారాయణ ఇటీవల అస్వస్థత కు గురై హైదరాబాద్ లో చికిత్స చేయుంచుకొని విజయవాడకు చేరుకున్నారు విషయం తెలుసుకున్న కనిగిరి మాజీ ఎమ్మెల్యే కదిరి బాబురావు బొత్స నివాస గృహానికి వెళ్లి పరామర్శించి ఆరోగ్య పరిస్థితులు అడిగితెలుసుకున్నారు. ఈ కార్యక్రమం లో మాజీ మంత్రివర్యులు అంబటి రాంబాబు, చెల్లుబోయిన వేణుగోపాల్, తదితరులు ఉన్నారు.

## టెట్ మినహాయింపు ఇవ్వాలని ధర్నాను విజయవంతం చేయాలి

**- ఏపీటీఎఫ్ నాయకులు పిలుపు**

గాయత్రి వార్తలు

టెట్ నోటిఫికేషన్ రాకముందు ఎంపికైన ఉపాధ్యాయులను టెట్ నుండి మినహాయించాలని కోరుతూ ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో మార్చి 10వ తేదీన ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద జరిగే ధర్నాలో ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు విరివిగా పాల్గొని విజయవంతం చేయాలని ఏపీటీఎఫ్ సి యస్ పురం మండల శాఖ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు తోట శ్రీనివాసులు జె ఎస్ ఆనంద్ బాబు జిల్లా కార్యదర్శి జి రామక్రిష్ణ పిలుపు నిచ్చారు. విద్యా హక్కు చట్టం ఆధారంగా సర్వీసు లో ఉన్న ఉపాధ్యాయులు కూడా టెట్ పరీక్షలు ఉత్తీర్ణులు కావాలని, లేని యెడల ఉద్యోగాల నుండి తొలగించాలని సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చిన పరిస్థితి ఉందని, ఈ తీర్పు రావటానికి మూలమైన విద్యా హక్కు చట్టాన్ని సవరించాలని, టెట్ నోటిఫికేషన్ రాక ముందు ఎంపికైన ఉపాధ్యాయులను టెట్ నుండి మినహాయించాలని వారు డిమాండ్ చేశారు. కావున ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు ఎక్కువగా పాల్గొని ఢిల్లీ ధర్నా కార్యక్రమం విజయవంతం చేయాలని వారు కోరారు .

**GAYATHRI VARTHALU Publisher, Editor and Owned by Maddineni Nageswara Rao,** SVN Colony, Guntur, Andhra Pradesh - 522006. PRGI Reg No - APTEL/25/A1201 .. Cell No - 7386045673 ..... Printed At SUNDAY PRINTING PRESS, SVN Colony, Guntur, Andhra Pradesh - 522006 ..Cell No - 7386045673.